క్లుప్తంగా

ముత్యాలమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ



ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న శ్రీబండి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలి వచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తమ మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఈఓ డి.రామకృష్ణంరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బీచ్‌లో పర్యాటకుల జోరు



కేపీ పాలెం బీచ్‌లో సెదతీరుతున్న సందర్శకులు

మొగల్తూరు: కేపీ పాలెం బీచ్‌కు ఆదివారం పర్యాటకులు తరలివచ్చారు. ఉదయం నుంచి చల్లని మబ్బులతో వాతావరణం ఆహ్లాదకరంగా ఉండటంతో పర్యాటకులు సముద్రస్నానం చేస్తూ సెదతీరారు. పర్యాటకుల రాకతో బీచ్ రోడ్డు కిటకిటలాడింది. సముద్ర స్నానం అనంతరం పర్యాటకులు తీరంలోని వేంకటేశ్వరస్వామి, వేలాంకణీ మాత, పాండురంగ స్వామి, 54 అడుగుల అభయాంజనేయ స్వామి, షిర్డీ సాయిబాబా, అష్టలక్ష్మీ ఆలయాలను దర్శించుకున్నారు.

మహనీయులను స్మరించుకోవాలి



స్వాతంత్య్ర సమరయోధులకు నివాళులర్పిస్తున్న చిన్నారులు

పెనుగొండ: ఆచంట పౌర ప్రాథమిక పాఠశాల వద్దలోక మాన్య బాలగంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్ చిత్రపటాలకు విద్యార్థులు ఘనంగా నివాళులర్పించారు. ఆదివారం బాలగంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయులు వారి సేవలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎం.త్రిమూర్తులు, సహోపాధ్యాయులు పాల్గొన్నారు.

మాస్టర్ ప్రింటర్స్ అసోసియేషన్ సమావేశం



పెనుగొండ మాస్టర్ ప్రింటర్స్ అసోసియేషన్ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: మాస్టర్ ప్రింటర్స్ అసోసియేషన్ నియోజకవర్గ సమావేశం ఆదివారం పెనుగొండలోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించారు. పెరిగిన ప్రింటింగ్ మెటీరియల్, అద్దెలు, వర్కర్ల వేతనాలుపై చర్చించారు. పనికి తగిన ధరలు నిర్ణయించుకుని ముందుకు సాగాలని నిర్ణయించారు. పెనుగొండ, మార్టేరు, ఆచంట, సిద్ధాంతం, ఏలేటి పాడులకు చెందిన ప్రింటింగ్ ప్రెస్ యజమానులు పాల్గొన్నారు.

క్షీరారామలింగేశ్వరునికి ఎస్పీ పూజలు



క్షీరారామలింగేశ్వరుని సన్నిధిలో జిల్లా ఎస్పీ రవిప్రకాష్ , ఆయన మిత్రులు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామిని జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్, ఆయన మిత్రులు దర్శించుకున్నారు. ఆదివారం ఆలయానికి వచ్చిన ఎస్పీ మిత్రులు స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఎస్పీ రవి ప్రకాష్ కూడా వచ్చి వారితో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం వేదాశీర్వచనం చేశారు. ఆలయ చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, ఆలయ సూపరింటెండెంట్ మెండెం స్వామిలు ఎస్పీని స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి చిత్రపటాన్ని అందజేశారు. పూజా కార్యక్రమాలు అనంతరం స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. పట్టణ సీఐ దారావత్తు రాంబాబు పాల్గొన్నారు.

శ్రీమావుళ్లమ్మకు పూజలు

భీమవరం (ప్రకాశం చౌక్): పట్టణ ఇలవేల్పు శ్రీమావుళ్లమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ నందుపు వెంకటేశ్వరరావు, విజయలక్ష్మి దంపతులు దర్శించుకున్నారు. రూ.5 లక్షలను అమ్మవారి ఆలయ అభివృద్ధి పనులకు వెచ్చించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఈఓ, ఆలయ సహాయ కమిషనర్ యర్రంశెట్టి భద్రాజీ, ఆలయ ధర్మకర్త రామాయణం సత్యనారాయణకు హామీ ఇచ్చారు.

రైతులకు వరం.. రైతు భరోసా కేంద్రాలు

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతన్నలపై ప్రత్యేక శ్రద్ధ
- గ్రామస్థాయిలోనే వ్యవసాయ సేవలు



పేరుపాలెంలోని రైతు భరోసా కేంద్రం



రైతులకు ఎరువులు పంపిణీ చేస్తున్న సిబ్బంది

మొగల్తూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత రైతులకు వెన్నుదన్నుగా నిలిచేందుకు ప్రవేశపెట్టిన రైతు భరోసా కేంద్రాలు రైతులకు భరోసాయే కాకుండా దేశంలోని ఇతర రాష్ట్రాలు కూడా మన రాష్ట్రం వైపు చూసేలా చేశాయి. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడమే కాకుండా సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు, యంత్రాలు, ట్రాక్టర్లును అందిస్తున్నారు. పంటకు అవసరమైన పురుగుమందులు, ఎరువులు, అందుబాటులో ఉంచుతున్నారు. రైతు భరోసా కేంద్రంలోని సిబ్బంది రైతులకు తగు సలహాలు, సూచనలు అందించి చేతికి పంట వచ్చే వరకూ కంటికి రెప్పలా వ్యవహరిస్తున్నారు.

మండలంలో 20 ఆర్‌బీకేలు

గతంలో రైతులకు ఏ అవసరం వచ్చినా మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చేది అధికారులు లేకపోతే కాళ్లరిగేలా తిరిగే వారు. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చిన తరువాత రైతులకు అందుబాటులో ఉండే విధంగా ఆర్‌బీకేలు ఏర్పాటు చేశారు. మండలంలోని 17 గ్రామాలకు సంబంధించి 20 రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి సంబంధిత అధికారులను, సిబ్బందిని నియమించారు. నాణ్యమైన విత్తనాలు అందించడమే కాకుండా చేతికొచ్చిన పంటను కూడా తామే స్వయంగా మిల్లులకు చేరవేసేలా అహర్నిశలు కృషి చేస్తున్నారు.

మండలంలోని రైతు భరోసా కేంద్రాలు	20
రైతులు	4812
ఎరువులు, విత్తనాలు అందుకున్న రైతులు	2113
ఉద్యానవన పంటలపై సబ్సిడీ పొందిన రైతులు	193

ఈ–క్రాప్ బుకింగ్‌తో పెద్ద సాయం

రైతులు తమ సాగు చేసే పంటకు సంబంధించి ఈ–క్రాప్ బుకింగ్ చేసుకుంటున్నారు. దీని ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సబ్సిడీలే కాకుండా ప్రకృతి విపత్తుల ద్వారా పంట నష్టం జరిగితే ప్రభుత్వం పంట నష్ట పరిహారం అందే అవకాశం ఉంది. గ్రామస్థాయిలో ప్రభుత్వం అందించే సేవలపై రైతన్నలు కూడా సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఆర్‌బీకేలు రైతులకు వరం



గ్రామాల్లో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు రైతులకు వరంలాంటిది. గత నాలుగేళ్లుగా రైతు భరోసా పొందుతున్నారు. జగనన్న వచ్చిన తరువాత సార్వా, దాళ్వా సాగులో ఏ ఇబ్బంది లేకుండా నాణ్యమైన విత్తనాలు నుంచి ఎరువులు, పురుగు మందులు అందుతున్నాయి. వ్యవసాయాధికారులు, సిబ్బంది తమ పొలాలకు వచ్చి సలహాలు, సూచనలు అందజేస్తున్నారు.

– గూడూరి మావుళ్ళు, నవుదూరి గరువు

ఎరువులు, విత్తనాలు అందుబాటులోకి రానున్నాయి



సార్వా సాగుకు అవసరమయ్యే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. దాళ్వాలో ఎక్కువగా సాగు చేసే 1318, సంపత్ స్వర్ణ రకం,7029 స్వర్ణ, 1061,1064 రకం విత్తనాలు రైతులకు అందించేందుకు సిద్ధంగా ఉన్నాం. రైతులు గ్రామంలోని ఆర్‌బీకేలను సద్వినియోగం చేసుకోవాలి.

– అబ్దుల్ రెహ్మాన్, వ్యవసాయాధికారి

ఆపదలో అండగా వలంటీర్లు

వలంటీర్లకు వందనం



గతంలో పింఛన్ తీసుకునేందుకు రోజుల తరబడి పంచాయతీ ఆఫీసుల చుట్టూ తిరిగాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు ఒకటో తారీఖునే వలంటీర్ తలుపుతట్టి మరీ అందిస్తుంది. ముఖ్యంగా నేను అనారోగ్యం వల్ల వైద్యం నిమిత్తం హైదరాబాద్‌లో ఉంటున్నా నా పరిస్థితి తెలుసుకుని వలంటీర్ రామకృష్ణ హైదరాబాద్ వచ్చి మరీ పింఛన్ అందించారు. వైద్య సమయంలో ఆ డబ్బు నాకు ఎంతగానో ఉపయోగపడింది. జగన్ బాబు ప్రభుత్వంలోనే మాలాంటి వృద్ధులకు న్యాయం జరుగుతుంది.

– జక్కంశెట్టి రామలక్ష్మి, కొడమంచిలి

సమాచారం ముందుగానే తెలుస్తుంది



నాలుగేళ్లనుంచి వలంటీర్లు సేవలందిస్తున్నారు. సమాచారం ఎప్పటికప్పుడు ముందుగానే అందిస్తున్నారు. నవరత్నాల పథకాలు పొందడానికి మాకు అర్హత ఉందని చెప్పి అవసరమైన ధ్రువీకరణ పత్రాలు తీసుకుని ఆన్‌లైన్ చేస్తున్నారు. మా వలంటీర్ మౌనిక కరోనా సమయంలో మేము ఏ చిన్న సహాయం కోరినా తక్షణం చేసేది. నాకు అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, సున్నా వడ్డీ పథకాలు ద్వారా లబ్ధిపొందుతున్నాను.

– అందే కోట గంగావతి, భగ్గేశ్వరం

కోడి రామకృష్ణకు ఘన నివాళి



కోడి రామకృష్ణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కళాపరిషత్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: ప్రముఖ సినీ దర్శకుడు కోడి రామకృష్ణ 74వ జయంతి కార్యక్రమం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం స్థానిక మారుతి థియేట వద్ద పాలకొల్లు కళాపరిషత్ ఆధ్వర్యంలో కోడి రామకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాపరిషత్ అధ్యక్షులు కేవీ కృష్ణవర్మ మాట్లాడుతూ వందకు పైగా చిత్రాలకు దర్శకత్వం వహించిన కోడి రామకృష్ణ ఎంతో మంది నూతన కళాకారులను చిత్రసీమకు పరిచయం చేశారన్నారు. పట్టణంలో లలిత కళాంజలి నాటక అకాడమి ఏర్పాటు చేసి 33 సంవత్సరాలు పాటు నాటిక పోటీలు నిర్వహించారన్నారు. ఆయన స్ఫూర్తితోనే గత 14 ఏళ్లుగా పట్టణంలో పాలకొల్లు కళాపరిషత్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కళాపరిషత్ సభ్యులు మేడికొండ శ్రీనివాసరావు, మానాపురం సత్యనారాయణ, జక్కంపూడి కుమార్, కొణిజేటి గుప్త, విన్నకోట వెంకటరమణ, కొయ్యాన సూర్యనారాయణ, థియేటర్ మేనేజర్ దేవళ్ల బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌వీకేపీ విద్యార్థుల అపూర్వ కలయిక



ఆత్మీయ సదస్సులో మాట్లాడుతున్న కళాశాల పాలకవర్గ సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ రాజు



సమావేశానికి హాజరైన పూర్వ విద్యార్థులు

పెనుగొండ: స్థానిక కళాశాలలో ఆదివారం ఓ అపురూప దృశ్యం ఆవిష్కృతమైంది. కళాశాల ప్రారంభమై 50 ఏళ్లు అవుతున్న సందర్భంగా ఆదివారం పెనుగొండ ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు అటానమస్ కళాశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సదస్సు నిర్వహించారు. కళాశాల మొదటి బ్యాచ్ నుంచి గత ఏడాది వరకూ విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. వృద్ధతరం నుంచి నేటి యువతరం వరకూ ఆయా బ్యాచ్‌ల విద్యార్థులు హాజరై నాటి స్థితి నుంచి నేటి ఉన్న త స్థితి వరకూ కళాశాల ప్రగతి, వారి జీవనం, హోదాలు, కుటుంబ పరిస్థితులను ఒకరికి ఒకరు చెప్పుకుని కళాశాల ఖ్యాతికి ఆనందాన్ని వెలిబుచ్చారు. ఈ సందర్భంగా పాలకవర్గ సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ రాజు మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల సహకారం అవసరమన్నారు. ప్రస్తుత కాలంలో చదువుతో పాటు అనేక నైపుణ్యాలు కలిగి ఉండడం వలనే విద్యార్థికి మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. దీనికి పూర్వ విద్యార్థుల సహకారం అవసరమన్నారు. కళాశాల ప్రగతినిపాలక వర్గ అధ్యక్షుడు పితాని సూర్యనారాయణ, ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీవీ అప్పారావు, కేవీ సూర్యనారాయణ వివరించారు. కార్యక్రమంలో ఆచార్య డాక్టర్ ఆర్.రామ్మోహనరావు, అంతర్జాతీయ క్రీడాకారుడు సత్తి సుబ్బన్ రెడ్డి, సీఐలు వి.పెద్దిరాజు, వి.వెంకటేశ్వరరావు, హైకోర్టు అడ్వకేట్ ఐ.రామానుజం, గేమ్స్ కోచ్ కృష్ణారెడ్డి, ప్రముఖ విశ్రాంత క్రీడాకారుడు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

గోదావరి వద్ద సందర్శకుల సందడి



వలంధర్ రేవులో నగరవాసుల సందడి



బాపూ కళాక్షేత్రం నుంచి వరదను చూసేందుకు వచ్చిన వీక్షకులు

నరసాపురం రూరల్: గోదావరికి వరదలొస్తే అందరూ ఆందోళనతో ఉంటారు కానీ కొంత మంది వరదను వీక్షించేందుకు వస్తున్నారు. నరసాపురం ప్రాంతం ఒకనాటి డచ్చి పాలకుల స్థావరం. గోదావరి ఒడ్డున డచ్చి భవనాలు కనిపిస్తాయి. వలంధర్ రేవు, స్టీమర్ రోడ్డు రేవు, పడవల రేవు డచ్చి కాలంలో పెట్టిన పేర్లే. ఈ ప్రాంతాల నుంచి చూస్తే గోదావరి వరద సుందరంగా దర్శనమిస్తుంది. ప్రతినిత్యం నరసాపురం ప్రజలు సాయంత్రమయ్యేసరికి ఆహ్లాదం కోసం గోదావరి గట్టుకు చేరిపోతారు. ప్రస్తుతం చల్లటి వాతావరణం ఉండడంతో గోదావరికి వరద తాకిడి ఉండడంతో సందర్శకుల తాకిడి ఎక్కువైంది.

గాయత్రి స్మార్త పురోహిత సంఘం వార్షికోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యనారాయణమూర్తి

పాలకొల్లు సెంట్రల్: సంఘం ఎంత బలంగా ఉంటే సమస్య అంత సునాయాసంగా పరిష్కారం అవుతుందని శ్రీ గాయత్రి స్మార్త పురోహిత సంఘం పట్టణ అధ్యక్షులు మద్దూరి సూర్యనారాయణమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాలులో శ్రీ గాయత్రి స్మార్త పురోహిత సంఘం నవమి వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణమూర్తి మాట్లాడుతూ సంఘం ఏర్పాటుచేసి తొమ్మిదేళ్లు అయ్యిందని ఇప్పటివరకూ సంఘం ఆధ్వర్యంలో సమస్యలో ఉన్న పురోహిత సంఘ సభ్యులకు సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. ఇప్పటికి సంఘంలో 60 మంది మాత్రమే సభ్యులున్నారని సభ్యులు సంఖ్య పెరిగితే కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవడానికి సంఘం ద్వారా అందరూ సహకరించినవారవుతారన్నారు. దాదాపుగా పురోహితులందరూ పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామినే నమ్ముకుని జీవనం సాగిస్తున్నామన్నారు. అలాంటి ఆలయం కోవిడ్‌కు ముందు ఉత్తరం వైపున షాపులు తొలగించడంతో ఆ ప్రాంతం అధ్వానంగా ఉండేదన్నారు. ఆలయ చైర్మన్‌గా భాద్యతలు స్వీకరించిన కోరాడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆలయం చాలా గొప్పగా అభివృద్ధి చేశారన్నారు. చైర్మన్‌తో పాటు ఆలయ కార్యనిర్వహణాధికారి యాళ్ల సూర్యనారాయణలు ఇద్దరూ పురోహితులందరికీ ఎంతో సహకారం అందిస్తున్నారన్నారు. అనంతరం వేదాంతం సదాశివరావు, పిడపర్తి శ్రీరామచంద్ర మూర్తిలను సత్కరించారు. కార్యక్రమంలో వీకే సత్యనారాయణ, దేవరకొండ సుబ్రహ్మణ్యశాస్త్రి, ములుకుట్ల రవీంద్ర, ముసునూరి ఫణి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పాలకొల్లు అర్బన్: మండలంలోని లంకలకోడేరు 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని లంకలకోడేరు గ్రామంలో సోమవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఎలక్ట్రికల్ సబ్ డివిజనల్ ఇంజనీర్ బి సురేష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. దగ్గులూరులో నిర్మిస్తున్న మెడికల్ కళాశాలకు విద్యుత్ పనుల నిర్మాణం నిమిత్తం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పేకాడుతున్న ముగ్గురి అరెస్ట్

నరసాపురం రూరల్: మండలంలోని లక్ష్మణేశ్వరం గ్రామంలోని పేకాట శిబిరంపై ఆదిఆవరం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో దేవునితోటలో పేకాడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్సై సుధాకర్ రెడ్డి తెలిపారు. వారి వద్ద నుంచి రూ14,500 నగదు స్వాదీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు.

కనకాయలంకలో డీఎంహెచ్ఓ పర్యటన



కనకాయలంకలో పర్యటిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ మహేశ్వరరావు, డాక్టర్ జాన్‌లియో

యలమంచిలి: వరద ముంపునకు గురైన కనకాయలంక గ్రామంలో ఆదివారం డీఎంహెచ్ఓ డాక్టర్ మహేశ్వరరావు పర్యటించారు. శిబిరంలో అందుతున్న వైద్య సేవలను, అందుబాటులో ఉంచిన మందులను తనిఖీ చేశారు. గ్రామంలో జరుగుతున్న జ్వరం సర్వేను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు గోదావరి వరద కారణంగా ప్రజలు ఎవరూ రోగాల బారిన పడకుండా వైద్య ఆరోగ్య శాఖ ద్వారా సంపూర్ణ పారిశుద్ధ్య చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఒకవేళ ఎవరైన రోగాలబారిన పడినా వైద్య సహాయం చేసేందుకు కనకాయలంకలో ఒక ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, హెల్త్ అసిస్టెంట్, ఆశ కార్యకర్తలు మూడు షిఫ్ట్‌లలో 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నట్లు వివరించారు. పాము కాటుకు, కుక్క కాటుకు అవసరమైన ఇంజక్షన్లుతో పాటు, అన్ని రకాల మందులు, ఇతర ఇంజక్షన్లు, క్లోరిన్ మాత్రలు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. దొడ్డిపట్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి డాక్టర్ జాన్‌లియో మాట్లాడుతూ గ్రామంలోని గర్భిణులకు, బాలింతలకు, చంటి పిల్లలకు సిబ్బందిని నిత్యం అందుబాటులో ఉంచుతున్నట్లు చెప్పారు. ఫీవర్ సర్వే చేసి జ్వర లక్షణాలు ఉన్న వారికి అవసరమైన చికిత్స అందిస్తున్నామన్నారు.

చేనేతలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి



ఆచంట వేమవరంలో సమస్యలను తెలుసుకుంటున్న రాష్ట్రయువజన అధ్యక్షుడు అల్లాడి

పెనుగొండ: చేనేతలకు ప్రతీ నియోజకవర్గంలో మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని జాతీయ చేనేత ఐక్య వేదిక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యువజన అధ్యక్షుడు అల్లాడి సూర్య భాస్కర్ రావు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆచంట వేమవరంలో చేనేత కార్మికుల సమస్యలపై ఇంటింటికీ వెళ్లి తెలుసుకొన్నారు. ప్రభుత్వం నుంచి వస్తున్న, రావాల్సిన సబ్సిడీలు, ఉచిత కరెంటు, నేతన్న నేస్తంలపై ఆరా తీశారు. చేనేతలకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, చేనేత యువతకు ప్రభుత్వం ఉపాధి కల్పించాలన్నారు. ప్రతీ నియోజకవర్గంలో మార్కెటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి నేరుగా అక్కడే వారు నేచిన వస్త్రాలు విక్రయించుకోవడం ద్వారా ఉపాధి కలుగుతుందన్నారు. పరిస్థితులు మెరుగవ్వడం ద్వారా ఆత్మహత్యలు నివారించగలుగుతామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు తాళ్ల కుమారస్వామి, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

విజయవాడ వెళ్లిన రేషన్ డీలర్లు



మొగల్తూరు నుంచి విజయవాడ తరలివెళ్తున్న డీలర్లు

మొగల్తూరు: రాష్ట్ర రేషన్ డీలర్ల సంఘం పిలుపు మేరకు మండలంలోని రేషన్ డీలర్లు విజయవాడకు ఆదివారం తరలి వెళ్లారు. తమ సమస్యలు విన్నవించుకోవడం కోసం, గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీల పరిష్కారం కోసం రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి కారుమూరి నాగేశ్వరరావుతో విజయవాడలో ఏర్పాటు చేసిన సమావేశానికి తరలి వెళ్తున్నట్లు మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు అందే వెంకటేశ్వరరావు తెలిపారు. విజయవాడ తరలి వెళ్ళిన వారిలో సత్తినేని బుజ్జి, మానేపల్లి పుల్లారావు, గొర్రె శ్రీను, కాసాని బాలు, దొంగ ఏడుకొండలు, పోతురెడ్డి సూరిబాబు, ఇంజేటి ప్రకాష్ తదితరులున్నారు.

సిద్ధాంతంలో గోదావరి వరద తగ్గుముఖం



సిద్ధాంతంలో నిలకడగా ఉన్న వశిష్ట గోదావరి

పెనుగొండ: గోదావరి పరవళ్ల ఉధృతి తగ్గుముఖం పట్టింది. సిద్ధాంతం వద్ద వశిష్ట గోదావరి నెమ్మదిగా తగ్గుతుంది. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రానికి శనివారం నాటికన్నా రెండు అడుగుల మట్టం తగ్గింది. దీంతో మధ్యస్థలంకలోకి రాకపోకలు యథావిధిగా కొనసాగిస్తున్నారు. ఆచంట మండలంలో పెదమల్లం, అయోధ్యలంక, భీమలాపురంల వద్ద ఉధృతి నెమ్మదిగా ఉండడంతో లంక గ్రామాల్లో సాధారణ పరిస్థితులు నెలకొని ఉన్నాయి. పడవల రాకపోకలు సాగుతున్నాయి, అధికారులు ఎప్పటికపుడు గోదావరి ఉధృతిని పర్యవేక్షిస్తున్నారు.